సాక్షి కామారెడ్డి

బుధవారం, 13, నవంబర్, 2024



వదంతులు నమ్మొద్దు

సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు కోరారు.

- 8లో ▸



వేగవంతం చేయాలి

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి నిర్వాహకులకు సూచించారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం

35.2 /14.9

ఉదయం ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. రాత్రి నిర్మలంగా ఉంటుంది. మంచు కురుస్తుంది. చలి తీవ్రత పెరిగే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

'బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి'



కామారెడ్డి టౌన్ : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి నాగరాణి సూచించారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని అడ్వకేట్ మ్యూచువల్ ఎయిడెడ్ సొసైటీ హాల్‌లో రెస్టారెంట్స్, హోటల్స్ యాజమానులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. బాల కార్మికుల చట్టాలపై వారికి అవగాహన కల్పించారు. బాలలను పనుల్లో పెట్టుకున్నా, వారితో పనులు చేయించినా యజమానులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. త్వరలో దుకాణాలను తనిఖీ చేస్తామన్నారు. హోటళ్లలో శుభ్రత పాటించి, కస్టమర్లకు నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు జూనియ ర్ అసిస్టెంట్ ఖాన్, సిబ్బంది శ్రవణ్, సాయిప్రణీత్, జిల్లా కార్మిక శాఖ జూనియర్ అసిస్టెంట్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి

కామారెడ్డి టౌన్: ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులపై సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ఒత్తిడి తగ్గించాలని టీపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. పాఠశాలల్లో మధ్యాహ్నం వరకు విధులు నిర్వహించి ఆ తర్వాత సర్వే చేయాలని ఆదేశించడం సరికాదని పేర్కొన్నారు. ఒక్కో కుటుంబాన్ని 75 ప్రశ్నలు అడిగి వివరాలు నమోదు చేసుకోవడానికి 45 నిమిషాలకుపైగా సమయం పడుతోందని, దీంతో రోజూ 10 నుంచి 20 ఇళ్ల సర్వే ఎలా సాధ్యమని ప్రశ్నించారు. సర్వేను వేగంగా పూర్తి చేయకపోతే క్రమశిక్షణ చర్యలు, షోకాజ్ నోటీసులు అంటూ ఉన్నతాధికారులు బెదిరించడం సరికాదని పేర్కొన్నారు. ఒత్తిడి లేకుండా సర్వే చేయడానికి అవకాశం కల్పించాలని ఉన్నతాధికారులను కోరారు.

కలెక్టర్‌పై దాడికి నిరసన



కామారెడ్డి అర్బన్: వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్లలో కలెక్టర్, తహసీల్దార్ తదితరులపై జరిగిన దాడిని కలెక్టరేట్‌లోని ఉద్యోగులు ఖండించారు. ఈ దాడి అమానుషమని పేర్కొన్నారు. మంగళవారం ఉద్యోగులు కలెక్టరేట్‌లో నల్లబ్యాడ్జీలు ధరించి కొద్దిసేపు నిరసన తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉద్యోగ సంఘాల ప్రతినిధులు వెంకట్‌రెడ్డి, ప్రేంకుమార్, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రహదారికి ధాన్యపు సిరి



నూర్పిడి చేసిన వడ్లను రోడ్డుపక్కన పోస్తున్న దృశ్యం



వడ్లను తూర్పారబడుతున్న మహిళా రైతులు



తూకం వేస్తున్న హమాలీలు



కామారెడ్డి–మెదక్ రహదారిపై వడ్ల కుప్పలు



లారీలో నింపుతూ..

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చింది. రైతులు నూర్పిడి చేసిన ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడుతున్నారు. పొల్లు లేకుండా చూసేందుకు తూర్పారబడుతున్నారు. ఆరిన ధాన్యాన్ని గోనె బస్తాల్లో నింపి తూకం కోసం కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కాంటా అనంతరం లారీల్లో నింపి రైస్‌మిల్లులకు చేరుస్తున్నారు. వరి కోతలు జోరందుకోవడంతో కామారెడ్డి నుంచి రాజంపేట మీదుగా మెదక్ వెళ్లే రహదారిపై ఆర్గొండ, కొండాపూర్, ఎల్లారెడ్డిపల్లి, గుండారం, గుండారం తండాల పరిధిలో ఎక్కడ చూసినా ధాన్యపు రాశులే కనిపిస్తున్నాయి. – సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

లబాన్ లడాయి!

తమ తెగను ఎస్టీ జాబితాలో చేర్చాలని డిమాండ్ చేస్తూ దశాబ్దాలుగా పోరాడుతున్న లబాన్ లంబాడీలు.. మరోసారి ఉద్యమ బాట పట్టారు. సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేలో తమ కులం ప్రస్తావన లేకపోవడంతో సర్వేను బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. తమ డిమాండ్‌ను పరిశీలించకపోతే పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామని సర్కారును హెచ్చరిస్తున్నారు.

- ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ దశాబ్దాలుగా పోరాటం
- అసెంబ్లీలో తీర్మానించినా ప్రయోజనం శూన్యమని ఆవేదన
- ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామంటున్న లబాన్ నేతలు
- సమగ్ర కుటుంబ సర్వే బహిష్కరణ



లబాన్ లంబాడీ మహిళలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : లబాన్, కాయితీ, మధుర, జుట్టు, కొప్పు.. ఇలా రకరకాల పేర్లతో పిలువబడే కాయితీ లంబాడీలు పశువుల పెంపకం, వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తారు. అటవీ ప్రాంతంలోనే నివసించే ఈ లంబాడీల వేషధారణ భిన్నంగా ఉంటుంది. వీరి సంప్రదాయాలు, సంస్కృతి ప్రత్యేకంగా ఉంటాయి. రాజస్థాన్, హర్యానా తదితర ప్రాంతాల నుంచి మూడు వందల ఏళ్ల క్రితం పశువులను మేపుకుంటూ వచ్చిన ఈ గిరిజనులు వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. కామారెడ్డి, సంగారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లో 158 తండాల్లో లక్షన్నరకుపైగా వారి జనాభా ఉంది. పశుపోషణ వీరికి ఎంతో ఇష్టం. ఇప్పటికీ ప్రతి కుటుంబానికి కొన్ని పశువులు ఉన్నాయి. కొన్ని కుటుంబాలైతే పూర్తిగా పశుపోషణ మీదనే ఆధారపడి జీవిస్తున్నాయి. కామారెడ్డి జిల్లాలోని గాంధారి, పిట్లం, లింగంపేట, బిచ్కుంద, బాన్సువాడ, పెద్దకొడప్‌గల్ మండలాలతో పాటు నిజామాబాద్ జిల్లాలోని వర్ని, నిజామాబాద్, సంగారెడ్డి జిల్లాలోని కంగ్టి మండలాల్లో కాయితీ లంబాడీ కుటుంబాలు ఉన్నాయి. అలాగే నిర్మల్, ఆదిలాబాద్ జిల్లాల్లోని బోథ్, ఉట్నూరు, నిర్మల్ ప్రాంతాల్లో కూడా కాయితీ లంబాడీలు జీవిస్తున్నారు.

బీసీ జాబితాలో..

కాయితీ లంబాడీలు అటవీ ప్రాంతంలోనే నివసిస్తున్నా ఎస్టీ జాబితాలో లేరు. వీరు బీసీ–డీ గ్రూపులో ఉన్నారు. తమకు ఎస్టీ రిజర్వేషన్ వర్తించకపోవడంతో విద్య, ఉద్యోగాల పరంగానే కాకుండా రాజకీయంగానూ తీవ్రంగా నష్టపోతున్నామన్న భావన కాయితీలలో నెలకొంది. అన్ని రకాలుగా వెనకబడి ఉన్న తమను బీసీల్లో కొనసాగించడం సరికాదని వారు పేర్కొంటున్నారు. ఎస్టీ జాబితాలో కలపాలంటూ వీరు దశాబ్దాలుగా పాలకులను కోరుతున్నారు. ఏళ్ల తరబడిగా పాలకులకు మొరపెట్టుకుంటున్నా తమనెవరూ పట్టించుకోవడం లేదన్న ఆవేదనలో ఉన్నారు. గతంలో ముఖ్యమంత్రి హోదాలో గాంధారి మండలంలో పర్యటించిన దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డితో కాయితీ లంబాడీలు తమ గోడు వెల్లబోసుకున్నారు. ఎస్టీల్లో చేర్చాలని కోరారు. దీంతో వారి సమస్యను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. అంతటితో ఆగకుండా కాయితీ లంబాడీల రిజర్వేషన్ అంశాన్ని పరిశీలించమంటూ ఆయన అధికారులను ఆదేశించారు. అప్పట్లో దీనిపై చర్చ జరిగింది. అయితే ఆయన అకాల మరణంతో సమస్య అలాగే ఉండిపోయింది.

చెల్లప్ప కమిషన్ విచారణ

తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ వాల్మీకి బోయలతో పాటు కాయితీ లంబాడీల రిజర్వేషన్ అంశంపై చల్లప్ప కమిషన్ ద్వారా విచారణ జరిపించారు. చెల్లప్ప కమిషన్ గాంధారి, పిట్లం తదితర మండలాల్లో పర్యటించింది. కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసింది. రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని కోరుతూ కేంద్రానికి తీర్మానాన్ని పంపింది. అయితే తీర్మానంలో సవరణలు చేసి పంపాలంటూ కేంద్రం కోరింది. ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం మరోసారి ప్రతిపాదనలు పంపకపోవడంతో సమస్యకు పరిష్కారం లభించలేదు.

ఆందోళన ఉధృతం చేస్తాం..



దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో మా సమస్య పరిష్కారం అవుతుందనుకున్నాం. ఆయన ఇచ్చిన మాట ప్రకారం చర్యలు తీసుకున్నారు. ఆయన మరణంతో సమస్య అలాగే ఉండిపోయింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాత సీఎం కేసీఆర్ మా సమస్యను విని పరిష్కారానికి చెల్లప్ప కమిషన్‌ను పంపించారు. కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపించారు. కాని సవరణలు చేయమంటూ కేంద్రం నుంచి ఫైల్ వాపస్ వచ్చింది. దీంతో ప్రక్రియ మళ్లీ మధ్యలో ఆగిపోయింది. ఇప్పుడు ప్రభుత్వం కుల గణన చేస్తోంది. అయితే అందులో మా కులం ప్రస్తావనే లేదు. అందుకే సర్వేను బహిష్కరిస్తున్నాం. తమను ఎస్టీల్లో చేర్చాలన్న డిమాండ్‌తో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం. – తాన్‌సింగ్, రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్రీయ లబాన్ కాయితీ లంబాడీ సంఘం

గ్రూప్–3ని పకడ్బందీగా నిర్వహించాలి

- 8,268 మంది అభ్యర్థులకోసం 20 కేంద్రాల ఏర్పాటు
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : గ్రూప్–3 పరీక్షను జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం వివిధ శాఖల అధికారులతో గ్రూప్–3 పరీక్ష నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 17, 18 తేదీలలో పరీక్షలు జరగనున్నాయన్నారు. 8,268 మంది అభ్యర్థుల కోసం జిల్లా కేంద్రంలో 20 కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. అన్ని కేంద్రాలను పోలీసు అధికారులు ముందస్తుగా స్క్రీనింగ్ చేయాలని సూచించారు. ప్రహరీ లేని కేంద్రాలకు అదనంగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. అభ్యర్థులు పరీక్ష సమయానికి అర గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్, క్యాలికులేటర్, ఎలక్ట్రానిక్ గూడ్స్, గాడ్జెస్‌ను పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని స్పష్టం చేశారు. చీఫ్ సూపరింటెండెంట్ మినహా ఎవరికీ సెల్‌ఫోన్‌లకు అనుమతి లేదన్నారు. పరీక్ష నిర్వహణకు అవసరమైన ఇన్విజిలేటర్‌లను నియమించి, ఈ నెల 14 న శిక్షణ ఇవ్వాలని సూచించారు. పరీక్ష సమయానికి అనుగుణంగా బస్సులను నడిపించాలని, విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. బయటి వ్యక్తులు, మీడియా ప్రతినిధులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించకూడదన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఏఎస్పీ నరసింహారెడ్డి, డీఎస్పీ నాగేశ్వర్‌రావు, గ్రూప్–3 పరీక్షల రీజనల్ కోఆర్డినేటర్ విజయకుమార్, ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ వేణుగోపాల్, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్, జెడ్పీ సీఈవో చందర్, డీఈవో రాజు పాల్గొన్నారు.

సమగ్ర సర్వే వేగం పెంచండి



అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్

కామారెడ్డి క్రైం : ఇంటింటి సర్వే వేగం పెంచాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ సూచించారు. మంగళవారం ఆయన కలెక్టరేట్ నుంచి తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మండల ప్రత్యేక అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఇంటింటి సర్వేపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఎన్యుమరేటర్ రోజుకు 15 నుంచి 20 వరకు ఇళ్ల సర్వే పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అవసరమైన చోట్ల అదనంగా ఎన్యుమరేటర్‌లను నియమించుకోవాలన్నారు. తక్కువ కుటుంబాలను సర్వే చేసినవారు వేగం పెంచాలని సూచించారు. ప్రధానంగా పట్టణ ప్రాంతాల్లో ఎన్యుమరేషన్‌ను వేగవంతం చేయాలని ఆదేశించారు. అవసరమైన పక్షంలో మెప్మా సిబ్బందిని నియమించుకోవాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఎమ్మెల్సీ ఎన్నికల ఓటరు నమోదు ఫారాల పరిశీలనను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్‌లు శ్రీనివాస్‌రెడ్డి, విక్టర్, ఆర్డీవో రంగనాథ్‌రావు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పక్వానికి రాని పంటను కోయొద్దు



- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు
- హార్వెస్టర్ యజమానులతో అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి క్రైం : పక్వానికి రాకుండానే వరి పంటను కోయడం నేరంతో సమానమని రెవెన్యూ అదనపు కలెక్టర్ విక్టర్ పేర్కొన్నారు. జిల్లా కేంద్రానికి సమీపంలోని నర్సన్నపల్లి వద్దనున్న డీటీవో కార్యాలయం ఆవరణలో మంగళవారం హార్వెస్టర్ యజమానులు, డ్రైవర్‌లకు రవాణాశాఖ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వరి కోతల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. వర్షం వచ్చే సూచనలు ఉన్నప్పుడు గానీ, హార్వెస్టర్ మళ్లీ దొరకదేమో అనే సందర్భాల్లో గానీ రైతులు తమ పంట పూర్తి స్థాయిలో పక్వానికి (కోతకు) రాకపోయినా కోతలకు తొందరపడే అవకాశం ఉంటుందన్నారు. పక్వానికి రాకముందే కోస్తే తప్పు, తాలు వస్తాయన్నారు. రైతుకు నష్టం జరగకుండా వరి కోతలు చేపట్టాలన్నారు. వచ్చే సీజన్ నుంచి సీజన్ ప్రారంభానికి ముందే గ్రామ, మండల స్థాయిలలో అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు. జిల్లాలోని హార్వెస్టర్‌లను గ్రామాల వారీగా వరి కోతలకు కేటాయిస్తామన్నారు. ఎవరికి కేటాయించిన గ్రామాల్లో వారు పక్వానికి వచ్చినట్లు నిర్ధారించిన తర్వాతే వరి కోతలు చేపట్టాల్సి ఉంటుందన్నారు. ఇందుకు అవసరమైన యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తామన్నారు. జిల్లాలో 600 లకుపైగా హార్వెస్టర్‌లు ఉన్నాయని రవాణా శాఖ జిల్లా అధికారి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ప్రతి హార్వెస్టర్‌కు ఫిట్‌నెస్ తప్పనిసరి అన్నారు. నిబంధనలు పాటించకుండా పూర్తి స్థాయిలో కోతకు రాని వరి పంటను కోస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ నర్సింహారెడ్డి, డీపీవో తిరుమల ప్రసాద్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, ఇన్‌చార్జి డీఎస్‌వో నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

నిలువ నీడ కరువయ్యింది

- కొత్త ఇల్లు ఇస్తామని.. పాత ఇంటిని కూల్చేసిన అధికారులు
- సగం మందికే దక్కిన డబుల్ బెడ్ రూం ఇళ్లు
- మిగతావారికి తప్పని ఎదురుచూపులు
- పాత బాన్సువాడలో నిరసన

బాన్సువాడ : బాన్సువాడ పట్టణంలోని పాత బాన్సువాడ దళితవాడలో 1983–1984లో అప్పటి ప్రభుత్వం 107 మంది దళితులకు ఇళ్లు మంజూరు చేసింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లకు పగుళ్లు ఏర్పడడంతోపాటు వర్షం కురిస్తే ఇళ్లలోకి నీరు చేరుతుండడంతో సమస్యను పలుమార్లు పాలకుల దృష్టికి తీసుకువెళ్లారు. గతంలో నిర్మించిన 107 ఇళ్లను కూల్చి వేసి వాటి స్థానంలో కొత్తగా డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని పాలకులు చెప్పడంతో వారంతా సంబురపడ్డారు. గతేడాది 107 ఇళ్లను కూల్చిన అధికారులు.. 50 డబుల్ బెడ్ రూం ఇళ్లను మాత్రమే నిర్మించి అందించారు. మిగిలిన ఇళ్ల నిర్మాణం చేపట్టకముందే ప్రభుత్వం మారిపోయింది. దీంతో ఇళ్ల నిర్మాణం అటకెక్కింది. కొత్త ఇల్లు వస్తుందని సంబురపడ్డ వారికి నిలువ నీడ కూడా లేకుండాపోయింది. కొందరు అద్దె ఇళ్లలో ఉంటుండగా మరికొందరు అద్దె చెల్లించడానికి కూడా డబ్బులు లేక తాత్కాలికంగా గుడారాలు వేసుకుని ఉంటున్నారు. సర్కారు తమను ఆదుకోవాలని, ఇల్లు కట్టించి ఇవ్వాలని బాధితులు కోరుతున్నారు.



గుడారం వేసుకుని నివసిస్తున్న బాధితురాలు

బాధితుల ఆందోళన



కూల్చివేసిన ఇళ్ల వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

ఇళ్లలోకి వర్షపు నీరు వచ్చి చేరుతున్నందున వాటిని కూల్చివేసి డబుల్ బెడ్ రూం ఇల్లు మంజూరు చేస్తామన్న పాలకుల మాటలను నమ్మి మోసపోయామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత ఇంటిని కూల్చివేసిన అధికారులు.. కొత్త ఇంటిని మంజూరు చేయకపోవడంతో రోడ్డున పడ్డామని పేర్కొంటున్నారు. ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేస్తూ మంగళవారం పాత బాన్సువాడలో బాధిత కుటుంబాలు ఆందోళన చేశాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకంలో ముందుగా తమకే అవకాశం ఇవ్వాలని కోరారు.

పట్టించుకునెటోళ్లు లేరు..



డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టిస్తామని చెప్పి ఉన్న ఇంటిని కూల్చేశారు. ఇల్లు కూల్చేసి ఏడాదిన్నర అవుతున్నా మా గురించి పట్టించుకునే వారు లేరు. అద్దెలు కట్టలేక ఎండలో ఉండలేక అవస్థలు పడుతున్నాం. ఇళ్లను కూల్చినట్లే కొత్త ఇళ్లను నిర్మించి ఇవ్వాలి. – మ్యాతరి గంగామణి, బాధితురాలు

అద్దెలు కట్టలేక..



కొత్త ఇళ్లను కట్టిస్తామని ఉన్న ఇళ్లను కూలగొట్టారు. 15 నెలలు అద్దె ఇళ్లలో ఉన్నాం. అద్దె కట్టేందుకు డబ్బులు లేక డేరాలు వేసుకుని ఉంటున్నాం. మమ్మల్ని ఎవరూ పట్టించుకోవడం లేదు. సర్కారు స్పందించి వెంటనే ఇళ్లు కట్టించి ఇవ్వాలి. – మురగళ్ల శాంత, బాధితురాలు

క్లుప్తంగా

'ఉన్నత శిఖరాలను అధిరోహించాలి'

మాచారెడ్డి: స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు మరెన్నో ప్రదర్శనల్లో ప్రతిభ కనబరిచి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని కామారెడ్డి డీఈవో రాజు ఆకాంక్షించారు. మంగళవారం ఘన్పూర్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. అనంతరం ఇటీవల హైదరాబాద్‌లో డైమండ్ జూబ్లీ కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులను ఆయన అభినందించారు. విద్యార్థుల ప్రగతి, పాఠశాల పనితీరు, ఉపాధ్యాయుల హాజరు శాతం పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఎంఈవోలు ఎల్లయ్య, దేవేందర్ రావు, డిప్యూటీ డీఈవో బలరాంనాయక్, హెచ్‌ఎంలు రాజేశ్వర్ రెడ్డి, వెంకటాచారి, హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు ఉన్నారు.

మత్స్య కార్మికులకు జీవనోపాధి

నిజాంసాగర్(జుక్కల్): చేప పిల్లల పెంపకం ద్వారా కుల వృత్తిపై ఆధారపడిన మత్స్యకార్మికులకు జీవనోపాధి లభిస్తుందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం తుర్కపల్లి చెరువులో ప్రభుత్వం సరఫరా చేసిన చేప పిల్లలను ఆయన విడుదల చేశారు. నాయకులు నాగభూషణం గౌడ్, ఖాలిక్, రాములున్నారు.

ఉత్సవాలకు తరలి రావాలి

తాడ్వాయి(ఎల్లారెడ్డి): బ్రహ్మాజివాడి శివారులో గల సిద్ధేశ్వరాలయంలో ఈ నెల 15న జరుగబోయే వార్షిక ఉత్సవాలకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావాలని గ్రామపెద్దలు తెలిపారు. మంగళవారం గ్రామ పెద్దలు మాట్లాడారు. కార్తిక పౌర్ణమి సందర్భంగా జరిగే ఈ వార్షికోత్సవాలలో జపాన్ శాస్త్రవేత్త, టయోటా కంపెనీ మేనేజర్ పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం, యజ్ఞం, ప్రత్యేక పూజలు జరుగుతాయన్నారు.

సర్వేపై వస్తున్న వదంతులను నమ్మొద్దు

- ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు



అడివిలింగాలలో సర్వేను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు, కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిరూరల్: సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేపై వస్తున్న వదంతులను నమ్మవద్దని ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని రుద్రారం, అడివిలింగాల, జంగమాయిపల్లి గ్రామాలలో సర్వేను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించి మాట్లాడారు. ఈ సర్వే ద్వారా రాష్ట్రంలో అట్టడుగు స్థాయిలో ఉన్న పేదలకు ఆర్థికంగా బలపడేందుకు దోహదం చేస్తుందన్నారు. సర్వేను సక్రమంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా, తహసీల్దార్ మహేందర్‌కుమార్, ఎంపీడీవో ప్రకాష్, ఏఎంసీ చైర్మన్ రజితారెడ్డి, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, శేకావత్, తదితరులున్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన

లింగంపేట(ఎల్లారెడ్డి): పొల్కంపేట గ్రామంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే మదన్ మోహన్‌రావు మంగళవారం శంకుస్థాపన చేశారు. రూ.3 కోట్ల 75 లక్షలతో నిర్మించనున్న బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. రతన్‌నాయక్ తండా శివారు నుంచి పొల్కంపేట వరకు హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు.

విద్యార్థులు చదువుల్లో రాణించాలి

విద్యార్థులు చదువుల్లో రాణించాలని ఎమ్మెల్యే అన్నారు. డైట్ చార్జీలు ప్రభుత్వం పెంచినందుకు మంగళవారం మైనార్టీ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

బస్టాండ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డిలో బస్టాండ్ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు కాంట్రాక్టర్‌కు సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించి మాట్లాడారు. నిధులను డిప్యూటీ సీఎంతో మాట్లాడి విడుదల చేయించినట్లు తెలిపారు. బస్టాండ్ నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. మున్సిపల్ చైర్మన్ పద్మ శ్రీకాంత్, మండల, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాయిబాబా, వినోద్ గౌడ్, కౌన్సిలర్ కుడుముల సత్యనారాయణ, తదితరులున్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలి

- సబ్ కలెక్టర్ కిరణ్మయి



కొనుగోళ్లను తనిఖీ చేస్తున్న సబ్ కలెక్టర్

మద్నూర్(జుక్కల్): ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి సూచించారు. డోంగ్లీ మండలంలోని మదన్‌హిప్పర్గ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రైతులు నిర్దేశిత తేమ శాతం వచ్చిన ధాన్యాన్నే కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం నిలువ ఉంచకుండా ఏ రోజుకారోజు మిల్లులకు తరలించాలన్నారు. అనంతరం కొనుగోళ్ల రికార్డులను పరిశీలించారు.

సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

సమగ్ర సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని, అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని బాన్సువాడ సబ్ కలెక్టర్ ఆదేశించారు. డోంగ్లీ మండలంలోని కుర్లా, మద్నూర్ మండలంలోని అంతాపూర్, మద్నూర్‌లో కొనసాగుతున్న సమగ్ర కుటుంబ సర్వేను మంగళవారం సబ్ కలెక్టర్ పరిశీలించారు. ప్రజల సందేహాలను నివృత్తి చేస్తూ సర్వే చేయాలన్నారు. సర్వేతో ప్రభుత్వం వివిధ వర్గాల ఆర్థిక, సామాజిక అంశాలను అధ్యయనం చేసి ప్రజలకు మేలు చేస్తుందన్నారు. మండల ప్రత్యేక అధికారి నాగరాజు, తహసీల్దార్లు ముజీబ్, రేణుకచౌహాన్, ఎంపీడీవో రాణి, పంచాయతీ కార్యదర్శి సందీప్ తదితరులున్నారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన



మద్నూర్‌లో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

మద్నూర్/దోమకొండ/గాంధారి: వికారాబాద్ జిల్లాలో రెండు రోజుల క్రితం ప్రభుత్వ అధికారులపై జరిగిన దాడులను ఖండిస్తూ మద్నూర్, దోమకొండ, గాంధారి మండలాల్లో మంగళవారం స్థానిక ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. అధికారులపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సంఘటనకు కారకులైన అందరిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో ఇలాంటి చర్యలు పునరావృతం కాకుండా చూడాలని ఉద్యోగులు పేర్కొన్నారు.

జిల్లాలో గన్నీబ్యాగుల కొరత లేదు



తూర్పార పట్టే మిషన్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

దోమకొండ/బీబీపేట: ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ విక్టర్ అన్నారు. మంగళవారం దోమకొండ, బీబీపేట మండలాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. దోమకొండ సొసైటీ పరిధిలోని ధాన్యం కొనుగోళ్ల వివరాలను సొసైటీ సీఈవో బాల్‌రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ధాన్యం కాంటా వేయాలన్నారు. జిల్లాలో 423 కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరిస్తున్నామని ఆయన వివరించారు. గన్నీ బ్యాగుల కొరత లేదని, ధాన్యం రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు. బీబీపేటలో వడ్లను తూర్పార పట్టే మిషన్‌ను పరిశీలించారు. రైతులు వడ్లను ఆరబెట్టుకొని తగిన నిర్దేశిత తేమ శాతం వచ్చిన తర్వాతే కొనుగోలు కేంద్రాలకు తరలించాలని సూచించారు. దోమకొండ, బీబీపేట తహసీల్దార్లు సంజయ్‌రావు, సత్యనారాయన, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, ఏఎంసీ చైర్మన్ పాత రాజు, దోమకొండ ఆర్‌ఐ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో కామారెడ్డి -ఎల్లారెడ్డి ప్రధాన రహదారిపై మంగళవారం పోలీసులు వాహనాలను తనిఖీ చేశారు. పలువురికి జరిమానా విధించారు. పెండింగ్‌లో బిల్లులు ఉన్నట్లయితే ఆ బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకున్నారు. ఎస్సై వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

ఎల్లారెడ్డి: సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి సీఈఐఆర్ పోర్టల్ ద్వారా గుర్తించి ఫోన్ అందజేసినట్లు ఎస్సై మహేష్ మంగళవారం తెలిపారు. ఎల్లారెడ్డికి చెందిన పురం రాములు సెల్‌ఫోన్ పోగొట్టుకోవడంతో సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫిర్యాదు చేయడంతో ట్రేస్ చేసి బాధితుడికి అందించినట్లు చెప్పారు.

గ్రామ కంఠం భూముల కబ్జాలను తొలగించాలి

నిజాంసాగర్(జుక్కల్): మాగి జీపీ పరిధిలో కబ్జాకు గురైన గ్రామ కంఠం భూమిని పంచాయతీ అధికారులు స్వాధీనం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకుడు జయప్రదీప్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడారు. ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని సమాచారం హక్కు చట్టం ద్వారా కోరినా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు.

ధాన్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలి

ఎల్లారెడ్డిరూరల్: రైతుల వద్ద కొనుగోలు చేసిన ధాన్యం రవాణాకు ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ మహేందర్ కుమార్ ఆదేశించారు. మంగళవారం సాతెల్లి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఎప్పటికప్పుడు లారీల ద్వారా ధాన్యం రవాణా చేయాలని నిర్వాహకులకు సూచించారు.

వికటించిన పీఎంపీ వైద్యం



ఎల్లారెడ్డి: పట్టణంలో పీఎంపీ వైద్యుడు చేసిన వైద్యం వికటించినట్లు బాధితురాలి కుటుంబీకులు ఆరోపించారు. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిలో పీఎంపీ వైద్యుడిగా చలామణి అవుతున్న రవీందర్‌రావు వద్దకు ఎల్లారెడ్డికి చెందిన స్వర్ణలత అనే మహిళ కొద్ది రోజుల క్రితం అనారోగ్యానికి గురి కావడంతో వైద్యం కోసం వెళ్లింది. పీఎంపీ రవీందర్‌రావు స్వర్ణలతకు వైద్యం చేయగా అది వికటించిందని ఆరోపించారు. పీఎంపీ ఇచ్చిన ఇంజక్షన్‌తో బాధితురాలి శరీరంపై మొత్తం బుడగలు రావడంతో హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించి వైద్యం అందించినట్లు పేర్కొన్నారు. పీఎంపీ చేసిన వైద్యంతోనే స్వర్ణలత పూర్తిగా అస్వస్థతకు గురైందన్నారు. పీఎంపీ వైద్యుడిపై తగిన చర్యలు తీసుకోవాలని బాధితురాలి కుటుంబీకులు కోరుతున్నారు. ఈ విషయమై పోలీసులకు, వైద్యాధికారులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని అధికారులు తెలిపారు.

క్రైం కార్నర్

రేషన్ బియ్యం పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని కొజ్జా కాలనీలో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. మంగళవారం ఉదయం ట్రాలీ ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో వెంటనే దాడి చేసి ఒకరిని అదుపులోకి తీసుకొని 30 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు.

బిచ్కుందలో..

బిచ్కుంద: మండలంలోని కందర్‌పల్లి సమీపంలో ఉన్న జాతీయ రహదారిపై చేపట్టిన వాహనాల తనిఖీల్లో ఓ లారీలో తరలివెళ్తున్న 35 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఎస్సై మోహన్‌రెడ్డి మంగళవారం పేర్కొన్నారు. ఈ బియ్యం హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు తరలిస్తుండగా తనిఖీల్లో భాగంగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. బియ్యానికి సంబంధించిన ఎలాంటి పత్రాలు లేకపోవడంతో డ్రైవర్‌పై కేసు నమోదు చేసి లారీని పీఎస్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

చంద్రశేఖర్‌కాలనీలో..

నిజామాబాద్ రూరల్: మండలంలోని చంద్రశేఖర్‌కాలనీలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారని రూరల్ ఎస్‌హెచ్‌వో ఆరిఫ్ మంగళవారం పేర్కొన్నారు. చంద్రశేఖర్‌కాలనీలో ఎండీ జునాయిద్ ఇంట్లో అక్రమంగా 6 క్వింటాళ్ల పది కిలోల బియ్యం ఉన్నట్లు సమాచారం అందడంతో స్పెషల్ బ్రాంచ్ పోలీసులు ఇంటిపై దాడిచేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో పేర్కొన్నారు.

హార్వెస్టరు తట్టుకొని విరిగిన విద్యుత్ స్తంభాలు

- త్రుటిలో తప్పిన ప్రాణాపాయం



వేల్పూర్: మండలంలోని జాన్కంపేట్‌లో మంగళవారం హార్వెస్టరు యంత్రం కరెంటు వైర్లకు తట్టుకోవడంతో మూడు విద్యుత్తు స్తంభాలు విరిగిపోయాయి. ఆ సమయంలో ప్రధానరోడ్డుపై కరెంటు వైర్లు పడిపోగా, వాటి పక్కనే ఉన్న గ్రామస్తులకు ప్రాణాపాయం తప్పింది. పచ్చలనడ్కుడ రైతులు తమ వరిపంటను నూర్పిడి చేయించడానికి జాన్కంపేట్ మీదుగా హార్వెస్టరును తీసుకెళ్తున్నారు. ఇటీవల గ్రామంలో ప్రధాన రహదారిని డబుల్‌రోడ్డుగా మార్చడంతో రోడ్డు ఎత్తు చాలా పెరిగింది. దీంతో కరెంటు వైర్లు భారీ వాహనాలను తాకే విధంగా మారాయి. ఈ క్రమంలో రోడ్డుపై వెళ్తున్న హార్వెస్టరు యంత్రం కరెంటు వైర్లకు తట్టుకొని విద్యుత్తు స్తంభాలు విరిగిపడి మంటలు చెలరేగిన వెంటనే గ్రామస్తులు వెంటనే విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. విషయం తెలుసుకున్న ట్రాన్స్‌కో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని తెగిపోయిన కరెంటు వైర్లను సరిచేశారు. విరిగిపోయిన విద్యుత్తు స్తంభాలను హార్వెస్టరు యజమానితో ఏర్పాటు చేయిస్తామని వెల్లడించారు.

కాలువలో దూకి ఒకరి ఆత్మహత్య



బాల్కొండ: ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువలో దూకి ఒకరు ఆత్మహత్య చేసుకున్నట్లు బాల్కొండ ఎస్సై నరేశ్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. బాల్కొండ మండల కేంద్రానికి చెందిన కుందారపు గంగాధర్(70)కు మతిస్థిమితం సరిగి లేదు. సోమవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వచ్చిన అతను మద్యం సేవించి కాలువలో దూకాడు. ఉదయం మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

మద్యానికి బానిసై మరొకరు..



ఖలీల్‌వాడి: మద్యానికి బానిసైన ఒకరు జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు నాలుగో టౌన్ ఎస్సై శ్రీకాంత్ మంగళవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. ఎల్లమ్మగుట్టకు చెందిన వీర్వాక్ల శివలింగ(37), రుక్మిణి భార్యాభర్తలు. వీరికి కుమార్తె అపర్ణ ఉంది. శివలింగ మద్యానికి బానిస కావడంతో ప్రతి రోజు ఇంట్లో గొడవలు జరిగేవి. మద్యం తాగిన ప్రతిసారి అతను భార్యను కొట్టేవాడు. మంగళవారం ఉదయం 11 గంటలకు వీరి కుమార్తె అపర్ణ చదువుతున్న స్కూల్‌లో తల తిప్పి పడిపోయింది. విషయం తెలుసుకున్న రుక్మిణి స్కూల్‌కు వెళ్లి కుమార్తెను ఇంటికి తీసుకొచ్చింది. ఈ క్రమంలో ఇంటి లోపల గడియ పెట్టి ఉండడంతో ఎంత పిలిచినా శివలింగ రాలేదు. అనుమానంతో భార్య రుక్మిణి స్థానికులకు పిలువగా వారు పక్క గదిలో శివలింగ ఉరేసుకొని కనిపించాడు. మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి



సాయిలు మృతదేహం

ఇందల్వాయి: మండలంలోని ఎల్లారెడ్డిపల్లికి చెందిన కళ్లకుంటల సాయిలు(39) సోమవారం సాయంత్రం టీవీఎస్ ఎక్సెల్‌పై గ్రామం నుంచి తన ఇంటికి వెళ్తుండగా ప్రమాదవశాత్తు రచ్చబండ గచ్చుని ఢీకొన్నాడు. ఈ ఘటనలో అతనికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతి చెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మనోజ్‌కుమార్ పేర్కొన్నారు.

నిప్పంటుకొని ఒకరు..

జక్రాన్‌పల్లి: మండల కేంద్రానికి చెందిన చిలుకూరి నడిపి గంగారాం(67) ప్రమాదవశాత్తు నిప్పంటుకొని మృతి చెందాడు. ఎస్సై తిరుపతి మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. జక్రాన్‌పల్లి గ్రామానికి చెందిన చిలుకూరి నడిపి గంగారాం ఈనెల 11న రాత్రి ఇంట్లో మంచంపై పడుకుని బీడీ తాగుతుండగా ప్రమాదవశాత్తు బీడీకి ఉన్న నిప్పురవ్వలు మంచంపై పడి పరుపు కాలిపోయి మంటలు చెలరేగగా గంగారాంకు మంటలు అంటుకొని తీవ్ర గాయాలయ్యాయి. దీంతో అతన్ని కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆర్మూర్‌లోని ఆస్పత్రికి తరలించారు. మంగళవారం రాత్రి చికిత్స పొందుతు మృతి చెందినట్లు ఎస్సై పేర్కొన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



మృతిచెందిన పెద్ద వెంకటి

జక్రాన్‌పల్లి: మండలంలోని తొర్లికొండ శివారులో గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో సంతోష్‌నగర్ కాలనీకి చెందిన అలకుంట పెద్ద వెంకటి(59) మృతి చెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 11న వెంకటి తన టీవీఎస్ ఎక్సెల్‌పై పొలానికి వెళ్లి తిరిగి వస్తుండగా తొర్లికొండ గ్రామ శివారులోని ఎస్సీ బాలుర హాస్టల్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. స్థానికులు ఆర్మూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మంగళవారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమారుడు వెంకట్‌రాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

కల్లు మత్తులో స్నానానికి వెళ్లి..

కామారెడ్డి క్రైం: కల్లు తాగిన మత్తులో స్నానానికి వెళ్లి నీట మునిగి ఓ మహిళ మృతి చెందిన ఘటన కామారెడ్డి పెద్ద చెరువు వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మంగళవారం ఉదయం చెరువులో తేలిన మహిళ మృతదేహాన్ని గమనించిన స్థానికులు దేవునిపల్లి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి విచారణ చేపట్టారు. మృతురాలిని బాన్సువాడకు చెందిన దాసరి మంజుల(25)గా గుర్తించారు. సోమవారం మధ్యాహ్నం కామారెడ్డిలోని నిజాంసాగర్ చౌరస్తా ప్రాంతంలో ఉన్న ఓ కల్లు దుకాణంలో కల్లు సేవించిన తర్వాత స్నానం చేసి వస్తానని తన చెల్లెలు నిమ్మల శిరీషతో చెప్పి వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబీకులు పలు చోట్ల గాలించినా ఆచూకీ దొరకలేదు. మంగళవారం చెరువులో మృతదేహం తేలింది. మృతురాలి చెల్లెలు శిరీష ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతురాలికి భర్త తిరుపతి, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

మోపాల్: మండలంలోని మంచిప్పలో వృద్ధురాలిపై చేయి చేసుకున్నందుకు జగదీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ మంగళవారం పేర్కొన్నారు. ఎస్సై కథనం ప్రకారం.. జగదీశ్ వరికోత యంత్రంతో భూమారెడ్డి వరి పంటను కోశాడు. వాటికి సంబంధించి రూ.2500 భూమారెడ్డి చెల్లించాల్సి ఉంది. వాటిని అడిగేందుకు వెళ్లిన జగదీశ్‌కు, భూమారెడ్డి తల్లి మణెమ్మకు మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈక్రమంలో జగదీశ్ మణెమ్మపై చేయి చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు జగదీశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

వాహనాల తనిఖీ

మండల కేంద్రంలో పోలీసులు మంగళవారం వాహనాల తనిఖీ చేపట్టారు. సరైన ధ్రువపత్రాలు లేని 20 వాహనాలకు రూ.2200 జరిమానా విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ఎస్సై యాదగిరి సూచించారు.

బంగారంపై కన్నేసి.. అడ్డంగా దొరికి

- ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారాన్ని దొంగిలించిన ఆర్టీసీ డ్రైవర్
- విధుల నుంచి తొలగింపు

ఖలీల్‌వాడి: ఆర్టీసీ బస్సులో ఓ ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారు ఉంగరాల బాక్సును దొంగిలించిన డ్రైవర్‌ను విధుల నుంచి తొలగించినట్లు నిజామాబాద్-1 డిపో మేనేజర్ ఆనంద్ మంగళవారం పేర్కొన్నారు. డిపో మేనేజర్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజామాబాద్-1 డిపోకు చెందిన ఆర్టీసీ హైర్ బస్సు ఆదివారం వరంగల్ నుంచి నిజామాబాద్‌కు వస్తోంది. హన్మకొండ దగ్గర కొంత మంది ప్రయాణికులు బస్సు ఎక్కారు. ఓ మహిళా ప్రయాణికురాలు తన వద్ద ఉన్న బంగారు ఉంగరాల బ్యాగును డ్రైవర్ రామ్‌మోహన్‌రెడ్డి సీటు పక్కనే ఉండే బ్యానెట్‌పై ఉంచింది. బస్సులో ప్రయాణికులు ఎక్కువగా ఉండడంతో సదరు ప్రయాణికురాలు తన బ్యాగ్‌ను డ్రైవర్ పక్కన ఉంచాలని కోరడంతో అతను తన సీటు పక్కనే ఉంచాడు. అందులో బంగారు ఉంగరాలు ఉన్నట్లు గుర్తించిన డ్రైవర్ అదును చూసి బ్యాగులో ఉన్న ఉంగరాల బాక్సును బయటకు తీశాడు. ఇదంతా మరో ప్రయాణికుడు తన ఫోన్‌లో చిత్రీకరించాడు. కరీంనగర్ బస్టాండ్‌లో జరిగిన విషయం అందరికీ తెలియడంతో డ్రైవర్‌పై స్థానిక ఆర్టీసీ అధికారులకు ప్రయాణికులు ఫిర్యాదు చేశారు. దీంతో డ్రైవర్ రామ్‌మోహన్‌రెడ్డి ప్రయాణికురాలి బ్యాగు నుంచి బంగారాన్ని దొంగిలించినట్లు తేలడంతో విధుల నుంచి తొలగించినట్లు డిపో మేనేజర్ ఆనంద్ పేర్కొన్నారు.

చంపేసి.. కాళ్లు, చేతులు కట్టేసి..


- గుర్తు తెలియని మహిళ హత్య
- చెరువులో మృతదేహం లభ్యం



గుర్తు తెలియని మహిళ మృతదేహం

బాన్సువాడ: ఓ మహిళను చంపేసి.. కాళ్లు, చేతులు కట్టేసి చెరువులో పడేసిన ఘటన బాన్సువాడలోని కల్కి చెరువులో చోటు చేసుకుంది. సీఐ అశోక్ మంగళవారం తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. మండల కేంద్రంలోని కల్కి చెరువులో మహిళ మృతదేహం ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందడంతో ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ఓ మహిళను దుండగులు చంపేసి, కాళ్లు, చేతులు కట్టేసి మృతదేహాన్ని చెరువులో పడేసి ఉంటారని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతురాలి వయస్సు 45 ఏళ్ల వరకు ఉంటుందని, ఎరుపు రంగు చీర, నలుపు రంగు బ్లౌజ్ ధరించి ఉందన్నారు. మృతురాలి వివరాలు తెలిసిన వారు పోలీసులకు సమాచారం అందించాలని సీఐ కోరారు.

బాన్సువాడలో ఒకరి హత్య



కొండ వెంకటి (ఫైల్)

బాన్సువాడ: పట్టణంలో ఓ నిర్మాణం చేపడుతున్న ఇంట్లో వాచ్‌మన్‌గా పని చేస్తున్న కొండ వెంకటి(55) హత్యకు గురయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని పాత బాన్సువాడకు చెందిన కొండ వెంకటి సరస్వతి ఆలయ సమీపంలో రియల్టర్ ప్రకాశ్ అనే ఇంటి వద్ద వాచ్‌మన్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే రాత్రి ఇంటి నుంచి వచ్చిన వెంకటిని దుండగులు గొంతు కోసి హత్య చేశారు. ఉదయం పక్క అపార్ట్‌మెంట్‌లో పని చేసే మరో వాచ్‌మన్ వచ్చి చూడగా రక్తపు మడుగుల్లో ఉన్న వెంకటిని చూసి ఇంటి యజమాని ప్రకాశ్‌కు చెప్పడంతో ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలాన్ని ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్, పట్టణ సీఐ అశోక్, రూరల్ సీఐ రాజేశ్ సందర్శించి విచారణ చేపట్టారు. హత్య జరిగిన స్థలంలో పేకాట ముక్కలు ఉండడంతో రాత్రి పేకాట ఆడేవాళ్లు వచ్చి ఉంటారని, వారిని విచారిస్తే పూర్తి వివరాలు తెలుస్తాయనే కోణంలో పోలీసులు విచారణ చేపడుతున్నారు. ఒకే రోజు బాన్సువాడలో రెండు హత్యలు జరగడంతో పట్టణ వాసులు భయందోళనకు గురవుతున్నారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

చెరువులో మృతదేహం లభ్యం



నాగిరెడ్డిపేట: మండలంలోని జగ్గనిచెరువులో మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. ఎస్సై మంగళవారం తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డికి చెందిన షేక్ అహ్మద్ అలియాస్ హైదర్ హుస్సేన్(70) కొన్ని రోజులుగా మతిస్థిమితం సరిగా లేక రోడ్లపై తిరిగేవాడు. ఈ నెల 2న షేక్ అహ్మద్ ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబీకులు ఎల్లారెడ్డి పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. ఉదయం చెరువులో మృతదేహం ఉన్నట్లు గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహం హైదర్ హుస్సేన్‌గా గుర్తించి కుటుంబీకులకు సమాచారం అందించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోవడంతో ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాలుడి మృతికి కారణమైన వ్యక్తికి ఏడాది జైలు

ఖలీల్‌వాడి: బాలుడి మృతికి కారణమైన నిందితుడు షేక్ సర్దార్ అహ్మద్‌కు రెండు నేరాలకు ఏడాది జైలు శిక్ష, రూ. వేయి జరిమానా విధిస్తూ నిజామాబాద్ స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ వడ్డి హరికుమార్ మంగళవారం తీర్పు చెప్పారు. వివరాలిలా ఉన్నాయి. నగరంలోని నాగారం 80క్వార్టర్స్‌కు చెందిన షేక్ కలందర్ తన బంధువైన 16 ఏళ్ల షేక్ తౌఫిక్‌తో కలిసి ఆటో డ్రైవ్ చేసుకుంటు నాగారం నుంచి రహదారిపైకి రాగా ఇంద్రపూర్ దగ్గర వర్ని చౌరస్తా నుంచి అతివేగంగా, అజాగ్రత్తగా ఆటో నడుపుతూ వచ్చిన డ్రైవర్ షేక్ సర్దార్ అహ్మద్, కలందర్ మరో ఆటోను ఢీకొన్నారు. ఈ ఘటనలో అందులో ప్రయాణిస్తున్న కలందర్‌కు, తౌఫిక్‌కు గాయాలయ్యాయి. తౌఫిక్‌ను అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మరో ఆటోలో ఉన్న సంతోష్‌కు తీవ్రగాయాలయ్యాయి. విచారణలో భాగంగా సాక్ష్యాలను పరిశీలించిన న్యాయమూర్తి నిందితుడు ఒకరి మృతికి కారణమైనందుకు, మరో వ్యక్తిని తీవ్రంగా గాయపర్చినందుకు రెండు నేరాలకు ఏక కాలంలో ఏడాది జైలు శిక్ష అనుభవించాలని, రూ. వెయ్యి జరిమానా చెల్లించాలని తీర్పులో పేర్కొన్నారు. ఆటో యజమాని అయిన మహమ్మద్ గౌసొద్దీన్ అనధికార వ్యక్తికి ఆటోను ఇచ్చినందుకు జడ్జి రూ. వేయి జరిమానా విధించారు.

ఒకరికి రెండు రోజుల జైలు

బోధన్‌రూరల్: అక్రమంగా గుట్కా, సిగరెట్, పాన్ మసాలాను తరలిస్తూ పట్టుబడిన వ్యక్తికి బోధన్ కోర్టు సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ శేషతల్పా సాయి రెండు రోజుల జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధిసూ తీర్పు చెప్పారు. గత నెల 30న బోధన్ రూరల్ పోలీసులు సాలూర మండల కేంద్రంలోని అంత్రరాష్ట్ర చెక్‌పోస్ట్ తనిఖీల్లో మహారాష్ట్రకు చెందిన ఆజాం మహమ్మత్ యూసుఫ్ అక్రమంగా గుట్కా, సిగరెట్, పాన్ మసాలాను తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశారు. మంగళవారం అతన్ని బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి అతనికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.5వేలు జరిమానా విధించినట్లు బోధన్ ఎస్సై మచ్చేందర్ రెడ్డి పేర్కొన్నారు.

పొలంలో కరెంట్ షాక్



రామారెడ్డి: పొలంలో కరెంట్ షాక్ తగిలి ఓ రైతు ప్రాణాపాయ స్థితికి చేరుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. రామారెడ్డి మండలం ఉప్పల్‌వాయికి చెందిన బండకింద నారాయణ అనే రైతు తన వ్యవసాయ పొలం వద్ద మంగళవారం సాయంత్రం కరెంట్ షాక్‌కు గురయ్యాడు. స్థానికులు వెంటనే 108 అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.